క్లుప్తంగా

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ప్రోటక్షన్ సభ్యులు సరస్వతి, వెంకటి పిలుపునిచ్చారు. తెర్లాంలోని ఆర్సీఎం చర్చి వద్ద బుధవారం బాల్య వివాహాలను నిర్మూలించాలని కోరుతూ అవగాహన కార్యక్రమాన్ని వైసీబీ ఎన్‌జీవో చింతాడ హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తెర్లాంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్సీఎం చర్చి ఉపదేశులు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



పాలిసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బొబ్బిలి రూరల్: మండలంలో కలవరాయి గ్రామం వద్ద ఉన్న వివేకానంద ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 562 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 466 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 96 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్ఐ

తెర్లాం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా జి.భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలను స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు కార్మికులకు సెలవు ఇవ్వాలి

రాజాం: మే డే రోజున అన్ని వర్గాల కార్మికులకు విధిగా యాజమాన్యం సెలవు ఇవ్వాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు బుధవారం యాజమాన్యాలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పనులు చేయిస్తే రెట్టింపు జీతం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. తప్పని పరిస్థితిల్లో పనులు చేయించుకున్న కార్మికులకు ఆ రోజు జీతంతో పాటు మరో రోజు సెలవు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత యాజమాన్యంపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.


శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలుకొలుపు



యూటీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీశ్రీకి నివాళులు

బొబ్బిలి: శ్రీశ్రీగా సాహితీ లోకంలో విలసిల్లిన భావ కవి శ్రీరంగం శ్రీనివాసరావుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘన నివాళులర్పించారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. విజయగౌరి, కృష్ణదాసు, ఆనెం శ్రీనివాసులు, ఎస్వీ రమణమూర్తిలు శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో జేసీ రాజు ఆధ్వర్యంలో శ్రీశ్రీ 115వ జయంతిని నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన రచనలను కొనియాడారు.

తాగునీటిని వృథా చేయొద్దు..



సంకిలిలో నీటిని పరిశీలిస్తున్న జేఈ శ్రీచరణ్

రేగిడి: తాగునీటిని వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ అన్నారు. మండలంలో సంకిలి, బొద్దవలస, ఉంగరాడ గ్రామాల్లో జలజీవన్ మిషన్ తాగునీటి పైపులైన్లు బుధవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడారు. పంచాయతీల్లో ఈ కుళాయిలు పనితీరుపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని, సమస్య ఉన్న ప్రాంతాల వివరాలు తమకు తెలియజేయాలని అన్నారు. సంకిలి పంచాయతీ సర్పంచ్ బుడుమూరు పట్టాభి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రాజాం : పట్టణంలో ఆదర్శనగర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజాం మండలం చీకటిపేట గ్రామానికి చెందిన చీకటి లక్ష్మణరావు, జయమ్మలు ద్విచక్ర వాహనంపై తమ కుమార్తెను చూసేందుకు ఆదర్శనగర్ వస్తున్నారు. ఇంతలో రాజాం వైపు నుంచి అమ్మవారి కాలనీకి వెళ్తున్న యువకుల ఎఫ్‌సీ గోదాం వద్ద బుల్లెట్ వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న చీకటి లక్ష్మణరావు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు, జయమ్మలతో పాటు బుల్లెట్ వాహనంపై వస్తున్న యువకులు గాయాల పాలయ్యారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న లక్ష్మణరావును 108 వాహనంలో రాజాంలోని జీఎంఆర్ కేర్ ఆస్పత్రికి తరలించి, చికిత్సను అందిస్తున్నారు.



పెంట వద్ద చెత్తసంపద కేంద్రం వద్దే రహదారిపై కాల్చేస్తున్న చెత్త

చెత్త నుంచి సంపద ఉత్తిదే...!

- రూ.కోట్లు కుమ్మరించినా కానరాని ఫలితాలు

బొబ్బిలి రూరల్:

గ్రామాల్లోని చెత్తను సేకరించి తద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించి సొమ్ము చేసుకోవచ్చన్న ప్రభుత్వ ప్రణాళిక సరైన ఫలితాలివ్వడంలేదు. లక్ష్యం మంచిదే అయినా సరైన ప్రణాళిక, చిత్తశుద్ధి, సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించకపోవడం వంటి అంశాలలో ప్రభుత్వ గణం పూర్తిగా విఫలమైందన్న భావన ప్రజల్లో కలుగుతోంది. పదేళ్ల కిందట ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీల్లోని ఇళ్ల ద్వారా సేకరించిన చెత్తను శుద్ధి చేసి ఎరువుల తయారీ ప్రక్రియకు నాంది పలికారు. సరైన అవగాహన లేక గ్రామాలకు దూరంగా కిలోమీటర్ల ఆవల



దిబ్బగుడ్డివలసలో రెండు కిలోమీటర్ల ఆవల ఉన్న చెత్త సంపద కేంద్రం

వాటిని ఏర్పాటు చేశారు. లక్షలాది రూపాయిలను ఖర్చు చేసి షెడ్లు నిర్మించారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసే ప్రక్రియ కోసం ప్రత్యేక ట్యాంకులను ఏర్పాటు చేసి వాటిలో చెత్తవేసి వానపాములను పెంచడం ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతోందని భావించారు. ఆరంభ శూరత్వం చూపించారు. కొన్నాళ్లు అవి నడిచి తదనంతరం కాలంలో అవి ప్రచారాలకే పరిమితంగా మారాయి.

రైతులకు అవగాహన లేక..

కాగా చెత్త సంపద కేంద్రాల నుంచి తయారవుతున్న ఎరువుల వల్ల పంటలకు చేకూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. వాటి ధర, రసాయన ఎరువుల కంటే అతి తక్కువకే వస్తాయని తదితర అంశాలను ఎప్పుడో ఏడాదికి ఒకసారి జరిగే రైతుల సదుస్సులో చెబుతున్నారే తప్ప పూర్తి అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ క్రమంలో కొత్తగా మళ్లీ సేంద్రియ ఎరువుల తయారీ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంటోంది. గ్రామానికి దగ్గరగానే నిర్మిస్తామని చెబుతోంది. మరి గతంలో చేసిన ఖర్చు చెత్తలో కలిపేనట్లేనా.. అని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పుడు చేపట్టే సంపద కేంద్రాలనైనా నిర్వహణ, చిత్తశుద్ధి, రైతులకు విక్రయాలు జరిపి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చేయాలని తూతూ మంత్రపు చర్యలు చేపట్టవద్దని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు దూరంగా ఏర్పాటు

గ్రామాలకు కిలోమీటర్ల దూరంలో వీటిని ఏర్పాటు చేశారు. ఫలితంగా గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తను గ్రీన్ అంబాసిడర్లు అంత దూరం తీసుకుపోలేక మార్గమధ్యలోనే కాల్చేస్తున్నారు. ఫలితంగా చెత్త చిత్తశుద్ధి లేని పథకంలా తయారైంది. వేసిన షెడ్లకు, ట్యాంకులకు రూ.లక్షలు ఖర్చు చేసినా తయారైన ఎరువుల నుంచి సొమ్ము చేసుకోలేకపోతున్నారు. పెద్ద పంచాయతీలైన అలజంగి, కారాడ, దిబ్బగుడ్డివలస తదితర గ్రామాల్లో వీటి నిర్వహణ కూడా లేక మూలకు చేరాయి.

కిశోర బాలికలకు అవగాహన

బొబ్బిలి రూరల్: కిశోర బాలికలను గుర్తించి వారికి ఆరోగ్య సమస్యలపైనా, పౌష్టికాహారాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కిశోర బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15-18 ఏళ్ల బాలికలను గుర్తించి 20 మందిని ఒక గ్రూపును ఏర్పాటు చేయాలన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్, ఆరోగ్యం, బాల్యవివాహం, రక్తహీనత తదితర అంశా



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ

లపై వివరించాలన్నారు. ఎంఈఓ లక్ష్మణరావు, పిరిడి మెడికల్ ఆఫీసర్ వంశీ, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



కోమటిపల్లి వద్ద రహదారిపై కూలిన చెట్టు



వంగర: నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బొబ్బిలి రూరల్: మండలంలో మంగళవారం అర్ధరాత్రి తరువాత ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ గాలులతో పాటు వర్షం కూడా కురవడంతో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయానికే విద్యుత్‌ను పునరుద్ధరించారు. మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మెట్టవలస సమీపంలో మూడెకరాల అరటి తోట ధ్వంసమైంది. కోమటిపల్లి వద్ద రహదారిపై చెట్లు కూలిపోగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వంగరలో..

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి భారీగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. భారీ గాలులతో వంగర స్టేట్‌బ్యాంకు ఆవరణలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. పలు గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. నువ్వు పంట కూడా నేల వాలి పంట దెబ్బతిన్నదని రైతులు చెబుతున్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

రాజాం సిటీ: పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారించవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ అన్నారు. ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని లచ్చయ్యపేట సచివాలయ ఏఎన్ఎం, ఆశ వర్కర్ల పనితీరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నియంత్రించేందుకు ప్రభుత్వం అనీమియా ముక్తా భారత్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యకాలంలో అత్యవసర సమయాల్లో తప్ప ఎవరూ బయట తిరగవద్దని సూచించారు. కలుషిత నీరు తాగొద్దని, వేసవిలో వ్యాధులపై ప్రజలకు అప్రమత్తం చేయాలని అన్నారు. అనంతరం లచ్చయ్యపేటలో ప్రజలకు పలు సూచనలు



లచ్చయ్యపేటలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

చేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్, ఎల్‌టీ జె.సింహాచలం, ఏఎన్ఎం ఉమ, ఆశ వర్కర్లు మణి, ఇందిర, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే... ఎలా...!



అగురువీధిలో రోడ్డుపై ఉన్న బురదతో కూడిన మురుగు నీరు

రామభద్రపురం మండల కేంద్రంలోని అగురువీధి, గూడేపువీధిలలో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడం.. కొద్దిపాటి కాలువలున్నా పూడికలతో నిండిపోవడంతో మంగళవారం రాత్రి పడిన చిన్న పాటి వర్షానికి వర్షపు నీరు, ఇళ్లల్లోని వాడకం నీరు ఏకమై రోడ్లపై ప్రవహించింది. దాంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మురుగు నీటికి దుర్వాసనతో పాటు దోమలు ఉధృతి పెరిగి ముప్పేట దాడి చేస్తున్నాయని స్థానికులు



గూడేపువీధిలోని చిన్న కాలువలు, రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీటితో అధ్వాన్నంగా ఉన్న దుస్థితి

వాపోతున్నారు. డ్రైనేజీలు నిర్మించి మురుగు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– రామభద్రపురం

పంటల సాగుపై అవగాహన అవసరం

రేగిడి: రైతులు వ్యవసాయం సాగు చేసే ముందు ఆయా పంటలపై అవగాహన కల్పించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని ఖండ్యాం చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, అంబాడ వెంకటాపురం గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వేసవిలో పొలాలకు సేంద్రియ ఎరువులతో పాటు చెరువు మట్టిని ఎక్కువగా వేసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువుల వలన ఖర్చులు అధికంగా ఉండడంతో పాటు పంట దిగుబడి తగ్గిపోతుందని వివరించారు.

కనీస వేతనం వచ్చేటట్టు చూడాలి

బాడంగి: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులకు రోజుకు రూ.307లు వచ్చే విధంగా చూడాలని సిబ్బందిని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా బుధవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రతీ పంచాయతీలో ఫాం పాండ్స్ విధిగా ఏర్పాటు చేయాలన్నారు. వ్యక్తిగత రోజు వారి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఏపీఓ సాయికుమార్, టీఏలు పాల్గొన్నారు.

పరామర్శ



ఆశపు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం సిటీ: పట్టణ పరిధి పుత్సలవీధికి చెందిన ఆశపు అప్పలస్వామి, మల్లిబాబులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల వారి తల్లి, మాజీ ఎంపీటీసీ ఆశపు సత్యవతి మృతి చెందిన విషయం తెలుసుకుని కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఆశపు సూర్యం, డాక్టర్ బి.నరేంద్ర తదితరులు ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి



ముంపు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: వర్షం కురిసిన ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని అప్పయ్యపేట, మహరాణి పేట, గొల్లవీధి, పూల్‌భాగ్, మార్కెట్ ఏరియా, మేదరబంద ఏరియా, జయప్రకాష్ పాఠశాల ప్రాంతాల్లో సిబ్బందితో బుధవారం పర్యటించారు. కాలువల్లో సిల్ట్ వెంటనే తొలగించాలని ఆదేశించారు.

'వక్ఫ్'కు వ్యతిరేకంగా లైట్స్ ఆఫ్ మూవ్‌మెంట్

బొబ్బిలి: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ బొబ్బిలిలోని ముస్లింలు లైట్స్ ఆఫ్ మూవ్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి చేపట్టిన కార్యక్రమంలో ముస్లిం వీధిలో ఉన్న ముస్లింలంతా ఇళ్లలోని లైట్లను ఆపి సవరణ చట్టానికి నిరసన వ్యక్తం చేశారు. రాత్రి 9 గంటల నుంచి 9.15 వరకూ ముస్లింలు లైట్లు ఆర్పేసి చీకట్లోనే గడిపారు. గృహాలు, వాణిజ్య సమూహాలు, కార్ఖానాలు, వక్ఫ్ చట్ట సవరణ ఉద్యమ రాష్ట్ర కమిటీ, ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు నిరసన చేపట్టినట్టు ముస్లింలు తెలిపారు.

చందన స్వామి అవతారంలో వేంకటేశ్వరుడు

బొబ్బిలి పట్టణంలోని కంచర వీధిలో వేంచేసి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చందనోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం సింహాచలేశునికి విశాఖలోని సింహాచలంలో చేసిన చందనోత్సవానికి సమాంతరంగా బొబ్బిలిలోని ఈ ఆలయంలో స్వామి వారికి చందనం పూసి అలంకరణ చేశారు. దీంతో భక్తులు తన్మయత్వం చెందారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– బొబ్బిలి



నూకాలమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ



బాడంగి మండలంలోని భీమవరం గ్రామంలో వెలసిన నూకాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత ఆలయం స్థానంలో కొత్త ఆలయ నిర్మాణాన్ని చేపట్టిన గ్రామస్తులు నూకాలమ్మ కర్ర బొమ్మలకు ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. అమ్మవారి పూజారి సమక్షంలో ఆలయ ప్రతిష్ఠను అర్చకుల మంత్రోచ్ఛారణలతో చేపట్టి ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. తొలిత అమ్మవారి ప్రతిమలకు పూజలు చేపట్టి అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు నూకాలమ్మ తల్లి దర్శనాన్ని కల్పించారు. – బాడంగి

అంబేడ్కర్ కలలుగన్న మేడేగా చేద్దాం..

బొబ్బిలి: మేడే కార్యక్రమాన్ని అంబేడ్కర్ కలలుగన్న కార్మిక దినోత్సవంగా చేద్దామని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన అంబేడ్కర్ మేడే అన్న కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలోని హే మార్కెట్ ప్రాంత కార్మిక ప్రాణ త్యాగాలకు ప్రతీకగా గత 138 సంవత్సరాలుగా కమ్యూనిస్టులు మేడేను నిర్వహిస్తున్నారన్నారు. అంబేడ్కర్ మాత్రం సిద్ధాంతానికి, ఆచరణకు పొంతన లేని మేడేను జరపొద్దని పిలుపునిచ్చారన్నారు. మేడే రోజున అంబేడ్కర్ చేసిన కార్మిక చట్టాల గూర్చి వివరించాల్సి ఉందన్నారు.

లేబర్ కోడ్‌లను అడ్డుకుంటాం

బొబ్బిలి: మేడే స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను మే 20న చేపట్టే సమ్మె ద్వారా అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. బుధవారం పట్టణ అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. జె.కామేశ్వరి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

రామభద్రపురం: సింహాచలం అప్పన్న చందనోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే క్యూలైన్‌లో గోడ కుప్పకూలి పలువురు భక్తులు మృతి చెందారని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇటీవల తిరుమలలో జరిగిన తొక్కిసలాట మరువక ముందే సింహాచలం దేవస్థానంలో కనీవినీ ఎరుగని విషాదం చోటుచేసుకుందన్నారు. నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. చందనోత్సవానికి లక్షల మంది వస్తారని తెలిసినా కూడా సరైన ఏర్పాట్లు చేయక ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రమాదం జరిగిందని విమర్శించారు. దీనిపై విచారణ చేయాలని



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు లక్ష్మణరావు

డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

రాజాం సిటీ: ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఏడాదికిగాను ఒక ఏడాది, రెండు సంవత్సరాల కోర్సులకు సంబంధించి మే 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఒక ఏడాది కోర్సులకుగాను కోపా, మెకానిక్ డీజిల్ ట్రేడుల్లోను, రెండు సంవత్సరాల కోర్సులకుగాను ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సులను భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ అనంతరం 26న ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గర్లోని ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, టీసీ, పాస్‌పోర్టు సైజు ఫొటోలుతో విజయనగరంలోని వీటీఅగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో జరుగనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90000 96048, 83094 38446, 99595 02238, 90520 85679 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అధ్వానంగా రహదారి



మజ్జిరాముడుపేట వద్ద ప్రమాదకరంగా బీటీ రహదారి

రేగిడి: మండలంలో ఉంగరాడమెట్ట, మజ్జిరాముడుపేట గ్రామాల జంక్షన్ల వద్ద పాలకొండ-రాజాం ప్రాంతాల ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వం రాజాం నుంచి సంకిలి వరకూ ఈ రోడ్డులో కొత్తగా బీటీ రోడ్డు నిర్మించారు. ఈ రెండు ప్రాంతాల్లో సీసీ రోడ్డు కొత్తగా వేయాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో ఈ జంక్షన్ల వద్ద గోతులు ఏర్పడి ప్రమా దాలు జరుగుతున్నా యి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఈ జంక్షన్ల వద్ద సీసీ రోడ్డు నిర్మాణాలు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

రేగిడి: మండల పరిధి అంబకండి గ్రామంలో పుట్టలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 1 నుంచి మూడు రోజుల పాటు జరపనున్నామని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, అభిషేకాలు, సూర్య నమస్కారాలు, స్వామివారి ఊరేగింపు ఉంటాయని తెలిపారు.